# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

**NOVEMBER 2007**

సంవత్సర చందా రూ. 50/-

# సత్యం అంతర్జాతీయం
## Truth is International

మార్కెట్‌లో సత్యం అత్యంత ప్రశస్తమైనది. ఈ లోకంలో సత్యంకంటె విలువైనదేదీ లేదు; సత్యం కంటే అందమైన మాట ఇంకోటి లేదు. ముఖ్యంగా ఆత్మీయ విషయాల్లో సత్యం మిక్కిలి శక్తివంతమైనది. అందుకే "సత్యమును అమ్మివేయక దానికొని యుంచుకొను మని" మనకు చెప్పబడినది (సామెతలు 23:23).

ప్రతి తరములోను సత్యము సత్యమే. ఈ భూమిపై ప్రతి దేశములోను, రాష్ట్రములోను, జనాంగములోను సత్యము సత్యమే. సత్యం నాశనమైపోదు. అబ్రహాము లింకన్ ఒకనితో వాదిస్తూ, "నేను చనిపోతాను నా పేరు మరచిపోతారు, గాని నేను ప్రవేశపెట్టుచున్న సూత్రములు నిలుచునని" చెప్పాడు. సర్వసత్యము నిత్యము నిలుచును. దేవుని వాక్యమే సత్యము (యోహాను 17:17). యేసు ప్రభువు వాక్యమును ఈ లోకం వినినను వినకపోయినను అది సత్యం. "గడ్డి యెండిపోవును దాని పువ్వు వాడిపోవును. మన దేవుని వాక్యము నిత్యము నిలుచును" (యెషయా 40:8). "ప్రభువు వాక్యము నిత్యము నిలుచును" (1 పేతురు 1:25).

ఈ భూమి పదిలక్షల సంవత్సరముల మట్టుకు ఉన్నదనుకొందాము. పదిలక్షల సంవత్సరముల తరువాత జనులు భూమిని త్రవ్వి న్యూయార్కు, లండన్, పేరిస్, బొంబాయి లాంటి మహానగరాలను కనుగొన్నారనుకొందాము. ఆ నాటికి మన రాజకీయ పార్టీలన్నీ మరచిపోబడును. వారు ఏయే అంశాల కొరకు పోరాడిరో కూడ మరచిపోబడును. అదే రీతిగ నేటి మతశాఖలు కూడా మరచిపోబడును. నేడు మనలను విభజించు సంగతులు లక్షలాది సంవత్సరముల మట్టుకు పాతిపెట్టి వేయబడును.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 28 | నవంబర్ 2007 | సంచిక 4


## దేవుని ప్రేమ - దాని లోతు,ఎత్తు - 2

(The Love of God, its Depth and Height)

దేవుని ప్రేమ యొక్క వెడల్పు పొడుగు లోతు ఎత్తు ఎంతో క్రైస్తవులు గ్రహించుకొనే శక్తి గలవారు కావలెనని అపో.పౌలు ప్రార్థించాడు.శాశ్వతమైన ప్రేమతో దేవుడు మనల్ని ప్రేమించుచున్నాడు. మనం ప్రస్తుతమున్న పరిస్థితులను బట్టిగాక దేవుని నిత్య సంకల్పాన్ని బట్టి ఆయన ప్రేమను కొరకు తన ఏకైక కుమారుడైన యేసుక్రీస్తు ఈ లోకానికి అర్పించాడు. ఆయన ప్రేమ యొక్క పొడుగు వెడల్పులు అంత గొప్పవి.

దేవుని ప్రేమ యొక్క లోతు ఎంతో కూడ మనం గ్రహించుకోవాలని బైబిలు చెప్పుచున్నది. సముద్రమంత వెడల్పు ఆకాశమంత ఎత్తు సముద్రమంత లోతైనది నా యేసు ప్రేమయే. అపాత్రుడనైన నన్ను ప్రేమతో దీవించును, నేనెందు బోయినన్ పాతకుండనైననన్ ప్రేమించున్" అనే పాటను మనం తరుచు పాడుచుందుము. దేవుని ప్రేమ సముద్రము కంటే లోతైనది. ఆయన ప్రేమ యుదార్థమైనది, బలమైనది.

దేవుడు లోకమునెంతో ప్రేమించారు, అయినను నీతిమంతుల యెడల ఆయన ప్రేమ ప్రత్యేకమైనది. "యెహోవా నీతిమంతులను ప్రేమించువాడని" దా.కీర్తన 146:8లో వ్రాయబడి యున్నది. "నీతి ననుసరించు వానిని ఆయన ప్రేమించును" అని సామెతలు 15:9 చెప్పుచున్నది. యేసు ప్రభువు ఇట్లు బోధించారు: "నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించువాడు: నన్ను ప్రేమించువాడు నా తండ్రి వలన ప్రేమింపబడును. నేనును వానిని ప్రేమించి వానికి నన్ను కనబరచుకొందును. ఒకడు నన్ను ప్రేమించును; మేము వాని యొద్దకు వచ్చి వానియొద్ద నివాసము చేతుము" (యోహాను 14:21-23). మనము దేవుని ఆజ్ఞలను గైకొనుటయే నీతి (కీర్త 119:172).

దేవుడే మొదట మనలను ప్రేమించాడని మనం జ్ఞాపకముంచు కోవాలి. "మనము దేవుని ప్రేమించితిమని కాదు; తానే మనలను ప్రేమించి మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమ యున్నది" అని భక్తుడైన యోహాను చెప్పుచున్నాడు (1యోహాను 4:10). మరల 19వ వచనములో, "ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాను" అని అతడు చెప్పాడు. ఈ లేఖనములను బట్టి మన ప్రేమపై దేవుని ప్రేమ ఆధారపడిలేదని గ్రహించు కోగలము. ఏలయనగా ఆయనే మొదట మనలను ప్రేమించారు. అవును అందుకే "శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను. గనుక విడువక నీ యెడల కృపచూపు చున్నానని" ఆయన పలికారు (యిర్మి 31:3). జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను" అని ఎఫెసీ 1:6లో అపొ.పౌలు చెప్పాడు.

మనము పాపులమైనను సరే దేవుడు మనలను ప్రేమించుచున్నారు. దేవుని యొక్క నిత్యప్రేమ ఎంత గొప్పదంటే మానవుడు పాపములో యున్నను, అతని కొరకు, అతని రక్షించదానికి ఆయన ప్రేమ సంసిద్ధముగా యున్నది. దేవుడు పాపమును అసహ్యించుకొంటారు. అయినను పాపిని ప్రేమించుచున్నారు. "నీ ప్రేమచేత నా ప్రాణమును నాశనమను గోతి నుండి విడిపించితివి. నీ వీపు వెనుక తట్టు నా పాపములన్నియు పారవేసితివి" యని యెషయా ప్రవక్త చెప్పుచున్నాడు (యెషయా 38:17). "భక్తిహీనుల మార్గము యెహోవాకు హేయము. నీతి ననుసరించు వానిని ఆయన ప్రేమించును" అని సామె 15:9లో వ్రాయబడి యున్నది.

"ఏలయనగా మనమింక బలహీనులమై యుండగా క్రీస్తు యుక్త కాలమున భక్తిహీనుల కొరకు చనిపోయెను. నీతిమంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు; మంచివాని కొరకు ఎవడైన ఒకవేళ చనిపోవ తెగింప వచ్చును. అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:6-8).

నశించుచున్న వారి యెడల పాపములలో బడియున్న వారి యెడల దేవుని ప్రేమ ఎంత గొప్పదో క్రీస్తు జీవితంలో మనం చూడవచ్చును. ఆయన సిలువపై నున్న దొంగను సహితం క్షమించారు. వ్యభిచారంలో పట్టుబడిన స్త్రీని శిక్షించక వదిలేసారు. చివరకు ఆయనను సిలువ వేసిన వారిని సహితం క్షమించుమని తండ్రికి ప్రార్థించారు: "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని" ఆయన ప్రార్థించారు (లూకా 23:34). దేవుని ప్రేమ యొక్క లోతు అంత గొప్పది.

యేసుప్రభువు తప్పిపోయిన కుమారుని గూర్చిన ఉపమానాన్ని బోధించారు. నిజానికి, మానవుల యెడల దేవుని కున్న ప్రేమను మనకు వర్ణించడానికి ఆయన ఆ కథనాన్ని చెప్పారు. ఒకని చిన్న కుమారుడు తండ్రి ఆస్థిలో తనకు వచ్చు భాగాన్ని కూర్చుకొని దూరదేశమునకు ప్రయాణమైపోయి అచ్చట తన ఆస్థిని దుర్ వ్యాపారము వలన పాడుచేసాడు. అదంతయు ఖర్చు చేసిన తరువాత ఒకని పందులను మేపుటకు సహితము ఒప్పుకొని పందులు తిను పొట్టుతో తన కడుపు నింపుకొన ఆశపడెను గాని యెవడును వానికేమియు ఇయ్యలేదు. అయితే బుద్ధి వచ్చినప్పుడు "నేను లేచి నా తండ్రి యొద్దకు వెళ్లి తండ్రీ నేను పరలోకమునకు విరోధముగాను,నీ యెదుటను పాపము చేసితిని ఇక మీదట నీ కుమారుడనని అనిపించుకొనుటకు యోగ్యుడనుకాను" అని చెప్పెదనను కొని లేచి తండ్రి యొద్దకు వచ్చాడు. "వాడింక దూరముగా ఉన్నప్పుడు తండ్రి వానిని చూచి కనికరపడి పరుగెత్తి వాని మెడ మీద పడి ముద్దు పెట్టుకొనెను". అతడు తన దాసులను చూచి, ప్రశస్త వస్త్రము త్వరగా తెచ్చి వీనికి కట్టి వీని చేతికి ఉంగరము పెట్టి పాదములకు చెప్పులు తొడిగించుడి. క్రొవ్విన దూడను తెచ్చి వధించుడి; మనము తిని సంతోషపడుదము. ఈ నా కుమారుడు చనిపోయి మరల బ్రదికెను. తప్పిపోయి దొరికెనని చెప్పెను" (లూకా 15:11-32).

తప్పిపోయిన ఈ చిన్న కుమారుడు మరల తిరిగి వచ్చేసరికి చాల అసహ్య పరిస్థితిలో యుండవచ్చును. అయినను వాడింక దూరముగా ఉండగానే తండ్రి అతని చూచి గుర్తుపట్టి జాలిపడి సంతోషంతో అతన్ని యింటిలోనికి చేర్చుకొన్నాడు. కుమారుని ఘనతను అతనికి మరల యిచ్చాడు. దేవుని ప్రేమ ఎంత గొప్పదో కదా ! మనం పాపం చేసినప్పుడు దేవునికి విరోధముగానే పాపము చేయుచున్నాము. ప్రతిసారి ఆయన నుండి దూరమైపోవు చున్నాము. తండ్రియైన దేవుడైతే మనము మారుమనస్సు నొంది ఆయన యొద్దకు ఎప్పుడు తిరిగివస్తామో యని ఆయన మన కొరకు కనిపెట్టుచున్నారు. మన యందున్న అమిత ప్రేమ వలన ఆయన కొరకు కనిపెట్టుచున్నారు. మన తప్పిపోయిన మన కొరకు వెదకుచున్నారు.

ఒకపాపి మారుమనస్సు పొంది తండ్రియైన దేవుని యొద్దకు తిరిగివస్తే పరలోకంలో కలిగే సంతోషాన్ని వర్ణిస్తూ యేసుప్రభువు మరల యిట్లు చెప్పాడు: "మీలో ఏ మనుష్యునికైనను నూరు గొర్రెలు కలిగి యుండగా వాటిలో ఒకటి తప్పిపోయిన యెడల అతడు తొంబది తొమ్మిదింటిని అడవిలో విడిచిపెట్టి తప్పిపోయినది దొరకు వరకు దానిని వెదకవెళ్ళడా? అది దొరికినప్పుడు సంతోషముతో దానిని తన భుజముల మీద వేసికొని యింటికి వచ్చి తన స్నేహితులను పొరుగు వారిని పిలిచి మీరు నాతో కూడ సంతోషించుడి; తప్పిపోయిన నా గొర్రె దొరికినదని వారితో చెప్పును గదా. అటువలె మారుమనస్సు అక్కరలేని తొంబది తొమ్మిది నీతిమంతుల విషయమై కలుగు సంతోషము కంటె మారుమనస్సు పొందు ఒక్క పాపి విషయమై పరలోకర మందు ఎక్కువ సంతోషము కలుగును" (లూకా 15:4-7).

దేవుని ప్రేమ పొడవైనది. అది నిత్యముండునది. అది సార్వజనికమైనది గనుక వెడల్పైనది. అది నశించిన వారిని పాపములో పడియున్న వారిని వెదికి రక్షించునది. గనుక బహులోతైనది. దేవుని ప్రేమ ఎత్తును కనుగొన గలవాడెవడు? "దేవుడు తన్ను ప్రేమించు వారి కొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు. చెవికి వినబడలేదు. మనుష్య హృదయమునకు గోచరము కాలేదు" అని వ్రాయబడి యున్నది (1 కొరి2:9). నీవు దేవుని ప్రేమకు పాత్రుడవా? యేసుప్రభుని నమ్మి పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. దేవుని ప్రేమను చవిచూడుము !!

# సంఘ విశ్వాసము

(Creed of the Church)

Credo అను లాటిన్ పదము నుండి Creed అను ఆంగ్లపద ముద్భవించినది. క్రీడ్ అను ఆంగ్లపదమును ఇట్లు నిర్వచింవచ్చును; "విశ్వాసము నొప్పుకొను ఏదైనా ఒక సూత్రము; పాటించబడు సిద్ధాంతముల యొక్కయు, అభిప్రాయముల యొక్కయు సంగ్రహం". విశ్వాస ప్రమాణము అనగా కొందరు "అపొస్తలుల విశ్వాస ప్రమాణమును" లేదా "నైసీన్ ప్రమాణమును" (Nicene Creed) తలంచెదరు. అయితే వానిలో ఏఒక్క దానిని గూర్చియు బైబిలునందు లేదు. అయితే ప్రతి మానవకల్పిత సంఘము మానవకల్పిత ప్రమాణ పుస్తకములను కలిగియున్నది. అట్టివన్నియు దేవుని వాక్యమునకు అదనముగా కల్పించినట్టివే.

బైబిలులో ఉన్న దానికంటె ఎక్కువ కలిగిన ప్రమాణ పుస్తకము (Creed Book) ఏదైనను బైబిలుకంటె మితి మీరినదగును. బైబిలునందున్న దానికంటె తక్కువ కలిగిన ప్రమాణ పుస్తకము బహు తక్కువ కలిగియుండును. బైబిలు నందున్న సంగతులే కలిగియున్న ప్రమాణ పుస్తకము, మన యొద్దబైబిలు ఉన్నందున ప్రయోజనము లేనిదగును. మనము దేవుని వాక్యమునకు కలుపుటగాని, తీసివేయుటగాని లేదా వేరొకటి దానియందుంచుటగాని చేయరాదని ప్రకటన 22:18,19 గలతీ 1:6-9లు వక్కాణించుచున్నవి. వేరొక మాటలో లేఖనములు సంపూర్ణములు, అవి పరిపూర్ణములు (2 తిమో 3:16,17, యాకోబు 1:25). మనము దైవోక్తులను బోధింపవలెను (1 పేతురు 4:11). అందువలన ఇతర గ్రంధముల యొక్క అవుసరత ఏమియును లేదు.

నేటి క్రైస్తవలోక మంతయును మానవ కల్పిత ప్రమాణములవలననే విభజింవబడెను గాని బైబిలు ననునరించుట వలన మాత్రము కాదు,ప్రతి సంఘము దాని ప్రత్యేక నియమమును కలిగియుండవలెనని కొందరు వాదింతురు. ఆలాగనుటలో వారు బైబిలును విసర్జించిరి యని

యర్థము. ఎంత విచారము! అందువలననే మానవకల్పిత గ్రంథములను విసర్జించి, దేవుని వాక్యమయిన బైబిలు నొద్దకు మరలవలెనని మేము అందరిని కోరుచున్నాము. బైబిలు మనలను యేసు క్రీస్తునందు ఏకము చేయునుగాని వేరుచేయదు.

క్రీస్తు సంఘముయొక్క విశ్వాస ప్రమాణము ఏమి? క్రీస్తు తప్ప వేరొకరక్షకుడు మనకు లేడు, బైబిలు తప్ప వేరొక ప్రమాణము లేదు. మతసంబంధమైన మన అభిప్రాయములు, తలంపులు నిష్ప్రయోజనములు. బైబిలును గూర్చిను స్వకీయ వివరణమును (Private Interpretation) మాకు లేదు. మాకు ఉన్నదంతయు బైబిలు మాత్రమే. దాని బోధలకు మేము లోబడియుంటిమి. మరియు ఇతరులకు దానిని సూచించుచుంటిమి. అందరును దానిని చదివి గ్రమించవలెనని మేము కోరుచున్నాము (యోహా 5:39; 2 తిమో 2:15). మనుష్యు లందరు, అంతటను బైబిలు బోధించుచున్నట్లే చేయవలెనని మేము కోరుచున్నాము.

మేము అనుసరించు అదనపు గ్రంధము లేక గ్రంధములు ఏమియును లేవు. ఏ మానవుడును బైబిలుతో సరి సమానమగు నియమావళిని వ్రాయలేడు అని మా విశ్వాసము. అట్టి గ్రంధమును వ్రాయుటకు ప్రభువు ఎవరికి అధికారము నియ్యలేదు. అట్టి గ్రంధమును వ్రాయుటకు పరిశుద్ధాత్ముడు ఎవ్వరికిని ఆత్మీయావేశము నీయలేదని మా విశ్వాసము.

దేవుని యొద్దనుండి, దైవావేశముచే నీయబడిన దేవుని వాక్యము మాత్రమే మనలను రక్షించును. సరిగదా ఆ దేవుని వాక్యమే మనలను అంత్యదినమందు తీర్పు తీర్చును (యోహా 12:48). అనేక ఇట్టి కారణములవలన మతసంబంధ సంగతులలో దానిని మేము మార్గదర్శిగా అంగీకరించుచు, ఇతరులు కూడ అట్లే చేయవలెనని ప్రోత్సహించుచున్నాము.

బైబిలు సత్యము అయినందున సత్యమును ఎరుగుటకు దానియొద్దకు మేము వెళ్ళుదుము. సత్య స్థావరము నొద్దకు వెళ్ళనియెడల సత్యమును కనుకొనలేము గదా. అందువలన సత్యమును నమ్ముటకు ముందు నీవు

సత్యమును వినవలెను (రోమా 10:17). మతసంబంధ సంగతులను గూర్చి నేడు అనేకులు మోసపోవుచున్నారంటే ఆశ్చర్యము లేదు. నేటి క్రైస్తవలోకమందు గొప్ప భేదములు, గందరగోళము ఉన్న వంటే ఆశ్చర్యములేదు. సహాయము కొరకు మానవులు దేవుని యొద్దకు వెళ్ళుటకంటే మనుష్యుని యొద్దకు వెళ్లుచున్నారు. బైబిలు బోధలను మాని మానవులు మనుష్యుల బోధనల యొద్దకు వెళ్లుచున్నారు. మానవుడు రక్షింపబడవలెననిన అతడు తప్పక బైబిలునొద్దకు మరలవలెను.

సంఘమును గూర్చిన సత్యమును తెలుసుకొనుటకు మానవులు బైబిలునొద్దకు వెళ్ళవలెనని మేము ప్రోత్సహించు చున్నాము. నకిలి సంఘములు అనేకములు నేడు లోకమునందున్నవి. అయితే ఏది సరియైనది? ప్రతి ఒక్క దానిని ఒకడు పరిశోధింపవలెనా? అట్లు కాదుకాని సంఘమును గూర్చి సత్యమును బోధించు గ్రంధమును అతడు పరిశోధింపవలెను. క్రీస్తు సంఘమును గూర్చిన సత్యమును ఎరిగిన తరువాత, బైబిలు బోధల ననుసరించి నడుచుకొను సంఘమును కనుగొనుట కష్టము కాదు.

రక్షణ పొందుటకు మానవుడేమి చేయవలెనో యను సత్యమును తెలిసికొనుటకు బైబిలు నొద్దకు వెళ్ళవలెనని మేము ప్రోత్సహించు చున్నాము. రక్షణ పొందుటకు అనేక మార్గములున్నవని మానవులు బోధింతురు. అయితే దేవుని వాక్యమునొద్దకు వెళ్ళినయెడల, ఒకడు సత్యమును వినవలెనని, విశ్వసించవలెనని తన పాపములు విషయమై మారుమనస్సు నొందవలెనని మరియు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మమును పొందవలెనని గ్రహించగలము (మార్కు 16:15,16 అపొ.కా. 2:38). మనుష్యులు బోధించు వాటిలో ఏమియును లేదు. రక్షించువాడు ప్రభువు గనుక ఒకడు ఆయన వాక్యమును విని ఆయనకు విధేయత చూపిన యెడల రక్షించబడగలరు.

దేవుని ఆరాధించుట యెట్లోయను సత్యము నెరుగుటకు మానవులు బైబిలు నొద్దకు వెళ్ళవలెనని మేము ప్రోత్సహించుచున్నాము. మానవు లెన్ని

చెప్పినను, ఆరాధన మార్గము లనేకములు లేవు. ఒకేఒక్క మార్గమున్నదని ఆ మార్గము ఎట్టిదై యున్నదో యని కూడ ప్రభువు తన వాక్యము నందు వివరించెను (యెహాను 4:24).

ఈ విషయములను గూర్చి మాత్రమే గాక, జీవమును గూర్చి ఉన్న ప్రతి అంశమును గూర్చిన సత్యమును తెలిసికొనుటకు అందరు బైబిలు నొద్దకు వెళ్ళవలెనని మేము కోరుచున్నాము. బైబిలును మనము అర్ధము చేసికొనలేమని, అందరు ఒకేరీతిగ అర్ధము చేసికొనలేరని మానవులు మనలను నమ్మించ(ప్రత్నించుచుండినను, అది సత్యము కాదు. మానవుడు నశించి పోవునట్లు బైబిలు నుండి అతడు దూరముగ యుండవలెనని అపవాది కోరుచున్నాడు. అయితే రక్షింపబడవలెననిన అతడు బైబిలు యొద్దకు వచ్చి దానిని విశ్వాసించి భక్తి విషయములలో దానిని మాత్రమే మార్గదర్శిగా అతడుంచుకొనవలెను. అప్పుడు మాత్రమే అతడు సరియగును గనుక అప్పుడు మాత్రమే అతడు రక్షింపబడగలడు.

మా విశ్వాస ప్రమాణము ఏమిటి? యేసుక్రీసు ఆయన వాక్యము. ఆయన తప్ప వేరొకడు లేడు. క్రీస్తు దేవుని కుమారుడని మేము నమ్ముదుము. ఆయన వాక్యమే సర్వ సత్యము. మేము దాని నంగీకరించి నడుతుము. అందరు అట్లే చేయవలెనని మేము కోరుచున్నాము. మానవ కల్పిత ప్రమాణములన్నియును ఒకేఒక చోటునకు నడుపును–నరకము. యేసు "నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" అని చెప్పను (యెహాను 14:6).

– జె.సి. ఛోట్

----0----

# ఇద్దరు సాక్షులు
## (The Two Witnesses)

**పరిచయము :**

❖ప్రకటన 9వ అధ్యాయం ఆఖరిభాగంలో దేవుని తీర్పుల వలన సంభవించిన ఆయాతెగుళ్ల వలన చావకయుండిన వారు మారుమనస్సు పొందిన వారుకారని తెలియజేయబడింది.

❖ఈలోగా దేవుని ప్రజలకేమి జరుగుచున్నది?

❖ప్రకటన 10:1 నుండి 11:14 వరకు వారికేమి జరుగుచున్నదో పరిచయం చేయబడినది. 10వ అధ్యాయంలో అది పరిచయం చేయబడింది. 11వ అధ్యాయం దానిని వర్ణించుచున్నది.

❖ఇప్పుడు ప్రకటన 11వ అధ్యాయం పూర్తిగా చదువుము.

**దేవాలయము కొలత వేయబడుట (11:1-11) :**

"మరియు ఒకడు చేతి కర్రవంటి కొలకర్ర నాకిచ్చి-నీవు లేచి దేవుని ఆలయమును బలిపీఠమును కొలతవేసి ఆలయములో పూజించువారిని లెక్కపెట్టుము" అని యోహానుకు చెప్పబడెను (11:1).

❖యెహెజ్కేలు 42:20లో దేవాలయమును కొలవేయుటను గూర్చి చెబుతు "నాలుగు తట్లు అతడు కొలిచెను, ప్రతిష్ఠితమైన స్థలమును ప్రతిష్ఠితము కాని స్థలము నుండి ప్రత్యేకపరచుటకై దాని చుట్టు నలుదిశల ఐదువందల బారలు గల చచ్చేకపు గోడ కట్టబడెయుండెను" అని చెప్పబడెను.

❖దేవుని ఆలయము ప్రతిష్ఠితము కాని స్థలమునుండి ప్రతిష్ఠితమైన స్థలమును ప్రత్యేకపరచుటకు కొలతవేయబడెను.

❖యెహెజ్కేలు 22:26; 48:35లను చదివితే ప్రతిష్ఠితముల నుండి ప్రతిష్ఠితములు కాని వాటిని వేరుచేయుట అత్యవసరమని గ్రహించ గలము.

❖జెకర్యా 2:1-5లో ప్రకటన గ్రంథములో మనము ఇప్పుడు చూచు దానికి సమాంతర లేఖనాన్ని చూడగలము. అక్కడ యెరూషలేము

పొడువు వెడల్పులు కొలువ వెళ్ళుచున్న యొకని చూడగలము.

❖ఈలాగు కొలత వేయుటలో రెండు ఉద్దేశ్యములున్నవి. మొదటిది, పరిశుద్ధులను వేరుచేయుటకు,రెండవది వారికి భద్రత కల్పించుట.

❖ప్రకటన 11:1లో యోహాను దేవుని ఆలయములో బలిపీఠమును అందులో పూజించు వారిని కొలతవేయుమని చెప్పబడెను.

❖యిది పరిశుద్ధులను వేరు పరచుటకుద్దేశించిన క్రియ.

❖దేవునిప్రజలు బాధింపబడినను వారు నాశనము కారనే భావం ఇక్కడయున్నది.

❖11:2 "ఆలయమునకు వెలుపటి ఆవరణమును కొలత వేయక విడిచిపెట్టుము, అది అన్యుల కియ్యబడెను. వారునలువది రెండునెలలు పరిశుద్ధ పట్టణమును కాలితో త్రొక్కుదురు".

❖యిది యెరూషలేములో యున్న భౌతిక ఆలయమునుద్దేశించి చెప్పబడినది కాదు.

❖క్రొత్తనిబంధనలో క్రీస్తుసంఘమే దేవుని ఆలయము (1కొరింథీ 3:16-17; 1కొరింథీ 6:19-20; 2కొరింథీ 6:16-17 చదువుము).

❖ప్రకటన 11:1-2 దేవుని సంఘము ప్రత్యేక పరచబడి, సంరక్షింపబడుటకు గాను కొలతవేయబడుట చూచుచున్నాము. ఆయన తన ప్రజలు మధ్య వారితోయుండును.

❖పరిశుద్ధపట్టణం అనగా ఇప్పుడు యెరూషలేము కాదుగాని క్రీస్తు సంఘము (హెబ్రీ 12:22-23).

❖సంఘము లోకములో యున్నందున హింసల నెదుర్కొనుచుయుండును. అది ఆయనచే సంరక్షింపబడుచు యుండును.

❖లూకా 12:4-5 చదువుము. మనము దేవునికి నమ్మకముగా యున్నంత కాలము, ఆయన ప్రజలుగా యున్నంతకాలము మనం హింసింపబడుచున్నను కాపాడ బడుచుందుము.

❖యోహాను 16:33; 2తిమోతి 3:15

## 42 నెలలు సంగతి యేమిటి ?

❖ఈ 42 నెలల కాలాన్ని అర్థం చేసుకొంటే పై వచనాలు దేవుని ప్రజలను గూర్చిచెబుతున్నట్లు గ్రహించు కొలగలము.

❖42 నెలలు అనగా $3^{1/2}$ సంవత్సరములు. యూదుల కేలండరులో 360 రోజులే యుండేవి. 42 నెలలు అనగా 1260 రోజులు.

❖ప్రకటన 12:14లో యిది కాలము, కాలములు, అర్ధకాలమని చెప్పబడింది. అక్కడ ఒక కాలము అనగా ఒక సంవత్సరము, కాలములు అనగా రెండు సంవత్సరములు, అర్ధకాలమనగా అర్ధ సంవత్సరమని యర్థము.

❖$3^{1/2}$ సంవత్సరముల కాలాన్ని వివిధ రీతులుగా ఇక్కడ చెప్పబడింది.

❖11:2లో పరిశుద్ధ పట్టణము 42 నెలల పాటు కాలితో త్రొక్కబడును.

11:3లో సంఘము లోకమంతటికి 1260 రోజలపాటు సువార్త చాటుచుండెను. 1260 రోజులంటే 42 నెలలే. ఈ మూడున్నర సంవత్సరముల కాలములో సంఘము హింసింప బడుచునను. కాపాడబడుచుండెను (ప్రకటన 12:14; 12:16).

❖42 నెలల పాటు అని చెప్పబడిన కాలములో సాతానుడు దేవుని ప్రజలను మోసగింప ప్రయత్నించుచుండెను.

❖అది సంఘము హింసింపబడుచున్న కాలము, సువార్త చాటుచున్న కాలము సాతానుడు మోసగించుచున్న కాలము.

❖దానియేలు 12:7లో 'కాలము, కాలములు, అర్ధకాలము' అను పదములు వాడబడెను. దీనిని చదువుము.

❖సంఘము సువార్త చాటుచుండగా, హింసింపబడుచున్న కాలము యేది? అది పెంతెకోస్తు నాడు క్రీస్తుసంఘము స్థాపింపబడిన నాటినుండి క్రీస్తు మరల వచ్చు వరకుయున్న సమయం.

❖గనుక 1260 దినములు, 42 మాసములు, కాలము, కాలములు అర్ధకాలము అనుమాటలు క్రైస్తవయుగాన్ని గూర్చిచెప్పబడినవి.

❖దీనిని అర్థం చేసుకొనుట ముఖ్యం.

**ఇద్దరు సాక్షులు (11:3) :**

"నేను నా యిద్దరు సాక్షులకు అధికార మిచ్చెదను, వారు గోనెపట్ట ధరించుకొని వెయ్యిన్ని రెండువందల అరువది సంవత్సరములు ప్రవచింతురు".

❖ఈ ఇద్దరు సాక్షులెవరు? "వీరు భూలోకమునకు ప్రభువైన వాని యెదుట నిలుచున్న రెండు ఒలీవచెట్లును దీపస్తంభములునై యున్నారు" (4వ).

❖దీని సందర్భము జెకర్యా 4:1-6లో చూడుము. ఈ రెండు ఒలీవచెట్లు యెహోవా వాక్కునకు గురుతుగా యున్నవి.

❖ప్రకటన 1:20లో దీపస్తంభములు స్థానిక క్రీస్తుసంఘములని గుర్తించుము. లోకములో సంఘము యొక్క ప్రయోజనం యేమి?

❖లోకమునకంతటికీ అది ఒక సాక్షిగా యున్నది.

❖ 11:7 ప్రకారము ఈ ఇద్దరు ప్రవక్తలు చంపబడబోవు చున్నారు. "వారు సాక్ష్యము చెప్పుట ముగింవగానే అగాధములో నుండి వచ్చు క్రూరమృగము వారితో యుద్ధముచేసి వారినిచంపును'', యుద్ధమొకటి జరుగుచున్నది గాని ఎవడును ఇద్దరు మనుష్యులతోనే యుద్ధము చేయడు.

❖ప్రకటన 13:7లో ఆ క్రూరమృగమునకు "పరిశుద్ధులతో యుద్ధము చేయను, వారిని జయింపను దానికి అధికారమియ్యబడెను".

❖ఆ క్రూరమృగము దేవుని ప్రజలతో యుద్ధము చేయును. గనుక ఆ ఇద్దరు సాక్షులు, ప్రవక్తలు, రెండు దీపస్తంభములు సువార్తను ప్రకటించు సంఘాన్ని సూచించుచున్నవి.

❖ఇద్దరని ఎందుకు చెప్పబడింది? ద్వితీయోపదేశకాండములో చెప్పబడిన సూత్రము 2కొరింథీ 13:1లో యున్నది చూడుము.

❖11:4-5 సంఘమునోట నుండి అగ్ని వచ్చి శత్రువులను ఎట్లు దహించివేయును? "వారు ఈ మాటలు పలికి నందున నా వాక్యములు వారిని కాల్చునట్లు నీ నోట వాటిని అగ్నిగాను, ఈ జనమును కట్టెలుగాను చేసెదను: ఇదే యెహోవాక్కు" (యిర్మియా 5:14).

❖సంఘము దేవుని వాక్యము ప్రకటించుచుయుండును; అది అనేకులను మార్చును. గాని వాక్యాన్ని నిరాకరించిన వారికి అది అగ్నియే.

❖ఆకాశమును మూయుటకు, నానావిధ తెగుళ్లను రప్పించుటకు వారికి అధికారము కలదు (11:5-6). సంఘము దీనినెట్లు చేయును?

❖ప్రకటన 8వ అధ్యాయములో గమనించినట్లు లోకమును మార్చుటకు సంఘ ప్రార్థనలలో శక్తియున్నది హింసింపబడు చున్న తన ప్రజల ప్రార్థనల నాయన ఆలకించును.

❖అందువలననే 'రాజుల కొరకు, అధికారుల కొరకు ప్రార్థన చేయుడి'

యని చెప్పబడినది.

**ఇద్దరు సాక్షుల మృతి (11: 7-14):**

❖సాక్షులు చెప్పుటముగియుగానే అగాధములో నుండి వచ్చిన క్రూరమృగము వారిని జయించిచంపును.

❖ఆ యిద్దరు ప్రవక్తలు భూనివాసులను బాధించినందున భూనివాసులు సంతోషించుచు ఒకని కొకడు కట్నములు పంపుకొనిరి.

❖దౌష్ట్యము చేత సంఘము లోకాన్ని హింసించ లేదుగాని, ఆహాబు దృష్టిలో ఏలియా ఇశ్రాయేలును 'శ్రమ పెట్టువాడై' నవిధముగా సంఘము కూడ పరిగణింప బడును.

❖సంఘము పాపాన్ని ఖండించును గనుక ప్రజాదరణ పొందదు (లూకా 18:8).

❖అయితే మూడున్నర దినములైన పిమ్మట దేవుని ఆత్మవారిలో ప్రవశించెను గనుక వారు సజీవులై నిలిచిరి (11:11-13).

❖అప్పుడు 'ఇక్కడకి ఎక్కిరండని' పరలోకమునుండి గొప్ప స్వరము వినబడగా వారు ఆరోహణమైరి. వారిశత్రువులు వారినిచూచిరి.

❖అప్పుడు గొప్ప భూకంపము కలిగెను అనేకులు చచ్చిరి.

❖దుష్టులు నాశనంగావించబడు చున్నారు. రెండవ శ్రమ గతించెను, ఇదిగో మూడవ శ్రమ త్వరగా వచ్చుచున్నది (11:14).

**ఏడవ బూర (11:15-19) :**

❖ఏడవ బూర ఊదినవ్పుడు పరలోకములో గొప్ప శబ్దములు పుట్టెను. ఈలోకరాజ్యము మనప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తురాజ్యము నాయెను. ఆయన యుగ యుగములు ఏలును.

❖దేవుడు విజేయుడయ్యారు. ఆయన ప్రజలు ఆయునతో యుండుటకు కొనిపోబడ్డారు. ఆయున యగయుగములు వారిని ఏలును.

❖దేవుని యెదుట సింహాసనాసీనులగు 24 గురుపెద్దలు సాష్టాంగపడి ఆయన నారాధింతురు.

❖దేవుని ప్రజలాయనతో యుండుటకు కొనిపోబడిరి. దేవుని ఆలయము తెరువబడెను. ఇప్పుడు యేసు యొక్క వర్తమానము నంగీకరించు ప్రతివానికి దానిలో ప్రవేశము కలదు.

❖హెబ్రీ 10:19-25 వరకు చదువుము.

**ముగింపు :**

ప్రకటన 4వ అధ్యాయములో యున్న దృశ్యమే 11వ అధ్యాయములో మనకు మరల ఇక్కడ వర్ణించబడినది. దేవుడు తన సింహాసన మందు ఆసీనుడై యున్నారు. ఉరుములు, మెరుపులు, భూకంపములు ఇవన్నియు దేవుని భయంకర మహిమను వర్ణించుచున్నవి. ఆయన మనకొరకు వేచియున్నారు. క్రీస్తు రక్తము సిలువపై చిందింపబడెను, దేవాలయపు తెరచినిగెను, దేవుని సన్నిధికి మార్గము తెరువబడెను.

❋❋❋

**బైబిలు సర్వే -3**

# వాక్యమును సరిగా విభజించుట

దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడనక్కర లేనిపనివానిగాను, సత్య వాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచు కొనుటకు జాగ్రత్తపడుము. (2 తిమోతి 2:15). బైబిలును బాగుగా అర్థము చేసుకొనుటకు వాక్యమును సరిగా విభజించుము.

## బైబిలు నందలి భాగములు

బైబిలు నందలి 66 పుస్తకములు 2 ప్రధాన భాగములుగా విభజించబడినవి. ఒకటి పాత నిబంధన, రెండవది క్రొత్త నిబంధన....క్రీస్తు రాక పూర్వము మానవునకు దేవునికి గల సంబంధమును పాత నిబంధన తెలియ పరచుచున్నది. క్రొత్తనిబంధన యందు క్రీస్తు జీవిత చరిత్ర, మానవులతో దేవుడు ప్రస్తుతము ఏలా వ్యవహరించుచున్నాడో తెలియుచున్నది.

లూకా 24:44 నందు యేసు మోషే ధర్మ శాస్త్రము, ప్రవక్తల గ్రంధములు, కీర్తనలు అని పాతనిబంధనను విభజించి చెప్పి యున్నారు. మనము బాగుగా అర్థము చేసుకొనుటకు పాతనిబంధన గ్రంధమును 5 భాగములగా విభజించుదము 1. ధర్మ శాస్త్రము 2. యూదుల చరిత్ర 3. పద్య భాగము 4, ప్రవక్తల గ్రంధములు పెద్దవి 5. ప్రవక్తల గ్రంధము-చిన్నవి. అలానే క్రొత్త నిబంధనను కూడా 5 భాగములుగా విభజించుదము 1. సువార్తలు 2. చరిత్ర 3. పౌలు వ్రాసిన పత్రికలు 4. సాధారణ పత్రికలు 5. ప్రవచన గ్రంధము.

## పాతనిబంధన పుస్తకములు

పాతనిబంధన యందలి మొట

మొదటి 5 పుస్తకములను ధర్మశాస్త్రము అని పిలుతురు. వీటికే పెంటటుక్ లేక పంచగ్రంధములని మరియొక పేరు కలదు. వీటిని మోషే వ్రాసెను. వీటి యందు మానవుని చరిత్ర వారితొలి జీవనము వ్రాయబడినది. ఆదికాండము మానవుని సృష్టి, పతనము, జలప్రళయము పితరుల యుగప్రారంభ సంఘటనలను తెలియ పరచుచున్నది. సృష్టి మొదలుకొని మోషే ధర్మశాస్త్రము వ్రాయు వరకూ వున్న మధ్య కాలమందు ప్రజలకు వ్రాత రూపకమైన ధర్మశాస్త్రము లేదు. ఈ కాలమునే "పితరుల యుగము లేక పితరుల కాలము" అని యందురు. ఈకాలము నందు కుటుంబ యజమాని తనంతట తానే దేవునిని తన కుటుంబము తరపున ఆరాధనలు జరిపెడివాడు. కాని మోషేకు ధర్మ శాస్త్రము అనుగ్రహింపబడిన తరువాత జాతియంతటికీ క్రమబద్ధమైన ఆరాధన ఏర్పరచ బడినది. నిర్గమ కాండము నందు ఇశ్రాయేలు సంతానము (తరువాత యూదులుగ పిలువబడిరి). ఐగుప్తు దాస్యము నుండి విడిపించ బడుట 40 సంవత్సరములు యడారిలో సంచరించుట చదువగలము. లేవీ కాండము, సంఖ్యా కాండము, ద్వితియోపదేశ కాండమునందు అరణ్య సంచార చరిత్రను, దేవునిచేత ఏర్పరచుకొనబడిన ప్రజలను పరిపాలించుటకు మోషేకు దేవుడిచ్చిన ధర్మ శాస్త్రమును వ్రాయబడి యున్నది. ఈ ధర్మ శాస్త్రమును బట్టియే ఇశ్రాయేలీయులు క్రీస్తు వరకూ వున్న కాలమును "మోషే యుగము" అని పిలుతురు.

మోషే ధర్మ శాస్త్రము యూదుల కోసమే అనుగ్రహించ బడినది. దీనికి క్రైస్తవులపై అధికారము లేదు. ఇదియును గాక క్రీస్తు శిలువపై మరణించట ద్వారా ధర్మశాస్త్రమును అంత మొందించెను.

వీటి తరువాత 12 గ్రంధములు యూదుల చరిత్రను వరుసక్రమములో తెలుపును. వీని యందు ఇశ్రాయేలు గొప్ప జాతిగాను విస్తారమైన ప్రజలుగా ఏలాగు అభివృద్ధి చెందిరో వ్రాయబడినది. వారు దేవునికి వ్యతిరేకముగా పాపము చేసి చెరకు తీసికొని పోవుట కొద్దిమంది శేషించిన వారు తిరిగి స్వదేశము చేరుట వ్రాయబడినది. ఇవి 1. యెహోషువ 2. న్యాయాధిపతులు 3. రూతు 4. సమూయేలు మొదటి గ్రంధము 5. సమూయేలు రెండవ గ్రంధము 6. రాజులు మొదటి గ్రంధము 7. రాజులు రెండడ గ్రంధము 8. దినవృత్తాంతములు మొదటి గ్రంధము 9. దినవృత్తాంతములు రెండవ గ్రంధము 10. ఎజ్రా 11. నెహెమ్యా 12. ఎస్తేరు. వీటిలోని కొన్ని గ్రంధములు యొక్క

గ్రంధకర్తలు మనకు తెలియదు.

పద్య గ్రంధములైన దేవుని 5 గ్రంధములందు దేవుని ధ్యానించుట, మనకు హెచ్చిరికలను వ్రాయబడనవి. ఈ గ్రంధములు ప్రస్తుతము మనకు తర్జుమా చేయబడినవి కనుక పద్యరూపాన కనిపించుట లేదు. కానీ అనేకులు అతి మిక్కుటము ఈ 5 పుస్తకములనే (ప్రేమించు) యిష్టపడు చున్నారు. అవి యోబు గ్రంధము (గ్రంధకర్త తెలియదు). ఇది యోబు అను ఒక ధనవంతుని చరిత్ర. అతడు దేవుని యందు విశ్వాసిగా వున్నందువలన తనకు కలిగిన సమస్తము పోగొట్టబడెను. 2. దావీదు కీర్తనలు. వీటిని ఎక్కువగా రాజైన దావీదు వ్రాసినందున వీటికా పేరు వచినది. ఇది నుత్తి గీతములు. ప్రపంచము నందు అత్యద్భుతముగా వ్రాయబడి ప్రజలందరికీ యిష్టమైన భాగము 23 దావీదు కీర్తన. 3. సామెతలు 4. ప్రసంగీ 5. పరమ గీతములు. ఇవి రాజైన సొలోమోనుచే వ్రాయబడివి. ఈయన వంటి జ్ఞానియిప్పటి కాలములో ఒక్కరిని కనుగొన లేము.

ప్రవచన గ్రంధములు రెండు భాగములు. ఈ భాగములు గ్రంధము యొక్క సైజును బట్టి పెద్దవి చిన్నవిగా ఎంచబడినవి. యిర్మియాచే రచించబడిన విలావ వాక్యముల గ్రంధము తప్ప మిగిలిన వన్నియూ గ్రంధకర్త పేరుతోనే పిలువబడుచున్నవి. ప్రవచన గ్రంధములైన 5 పెద్ద గ్రంధములు 1. యెషయా 2. యిర్మియా 3. విలాప వాక్యములు 4. యెహెజ్కేలు 5. దానియేలు, ప్రవచన గ్రంధములు చిన్నవి. 1.హోషేయా 2. యోవేలు 3. ఆమోసు 4.ఓబద్యా 5.యోనా 6. మీకా 7.నహూము 8.హబక్కుకు 9.జెఫన్యా 10.హగ్గయి 11. జకర్యా 12.మలాకీ. యెషయా గ్రంధము మెస్సయాను గూర్చి ఎక్కువగా రచించెను, దానియేలు గ్రంధమునందు చాలా ఆసక్తికరమైన సంగతులు అప్పటిలో జరిగినవి వ్రాయబడినవి. ఈ పుస్తకములలో చాలా వాటియందు అప్పటి యూదులను గూర్చి వారి పొరుగును నున్న ప్రజలను గూర్చి వ్రాయబడినది.

## క్రొత్త నిబంధన పుస్తకములు

మాలాకీ గ్రంధముతో పాతనిబంధన సమాప్త మైనది. క్రొత్తనిబంధన యందలి మొదటి 4 పుస్తకములు సువార్తలనబడును. అవి వాటి గ్రంధకర్తల పేరుననే పిలువబడుచున్నవి. సువార్త అనగా "మంచి వర్త మానము లేక సందేశము". ఈ 4 పుస్తకములు మానవులను రక్షించుటకు వచ్చిన క్రీస్తు బోధలను తెలియ పరచుచున్నవి. ఒక్కొక్కటి యేసు యొక్క జీవిత చరిత్ర.

ఒక్కొక్కటి దాని యందు కొన్ని సంగతులను మిగిలిన 3 పుస్తకములలో లేనివి వ్రాయబడినవి. కొన్ని సంగతులు మాత్రం 4 సువార్తలలో క్రీస్తు యొక్క జీవిత చరిత్ర మరణపునరుత్థానములను గూర్చి సవివరముగా వ్రాయబడినది. యేసు మరణము ద్వారా మోషేయుగము అంతరించి క్రీస్తు యుగము ప్రారంభమైనది. ఇది అనగా క్రైస్తవ యుగము భూమి అంతము వరకూ వుండును. అపోస్తలుల కార్యముల గ్రంధము సంఘ చరిత్రను తెలుపుచున్నది. దీనిని లూకా వ్రాసెను. దీనియందు క్రీస్తు యొక్క సంఘము ఏలాగు స్థాపించబడినది ఏలాగు వ్యాప్తి చెందినది. కొంతమంది అపోస్తలుల చేసిన కార్యములు మొదలగు ఆది సంఘ చరిత్ర వ్రాయబడినది. దీనిని క్రీస్తు తట్టు తిరిగిన వారిని గూర్చి చెప్పు గ్రంధమని కూడా పిలుతురు. ఎందుకనిన మొదటి శతాబ్దమున ప్రభువును అంగీకరించి క్రైస్తవులైన వారిని గూర్చి వ్రాయబడినది.

మిగిలిన 21 పుస్తకములను పత్రిక లందురు. క్రైస్తవులు ఏలాగు జీవించవలయునో యిందు ఉపదేశింపబడినది. వీనిలో కొన్ని వ్యక్తులకు వ్రాయబడినవి మరికొన్ని సంఘములకు వ్రాయబడినవి. వీటిలో మొట్టమొదటి 14 పుస్తకములు పౌలుచే రచింపబడినవి. అవేవనగా 1. రోమీయులకు వ్రాసిన పత్రిక 2. కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 3. కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 4. గలతీయులకు వ్రాసిన పత్రిక 5. ఎఫేసీయులకు వ్రాసిన పత్రిక 6. ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 7. కొలస్సీయులకు వ్రాసిన పత్రిక 8. థెస్సలోనికయులకు వ్రాసిన మొదటి పత్రిక 9. థెస్సలోనికయులకు వ్రాసిన రెండవ పత్రిక 10. తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక 11. తిమోతీకి వ్రాసిన రెండవ పత్రిక 12. తీతుకు వ్రాసిన పత్రిక 13. ఫిలేమోనుకు వ్రాసినపత్రిక 14. హెబ్రీయులకు వ్రాసిన పత్రిక. హెబ్రీ గ్రంధ కర్త ఎవ్వరో తెలియరాలేదు. మిగిలిన 7 పత్రికలు సాధారణ పత్రికలు అనిపిలువబడుచున్నవి. వీటిని పౌలు వ్రాయలేదు. అవి 1. యాకోబు 2. 1వ పేతురు 3 2వ పేతురు 4. 1వ యోహాను 5. 2వ యోహాను 6. 3వ యోహాను 7. యూదా, ఇవియన్నియూ ఆయా గ్రంధకర్తల పేర్లుతోనే పిలువ బడుచున్నవి.

బైబిలు నందలి ఆఖరి పుస్తకము ప్రకటన గ్రంధము. ఇది రాబోవు

సంగతులు త్వరలో జరుగనున్న వాటిని ప్రవచించినది (ప్రకటన 1:1) దీని గ్రంధకర్త యోహాను దీనిలోని కొన్ని భాగములు అర్ధము కానవప్పటికీ ధ్యానించుటకు ఎంతో ముఖ్యమైనది.

మనకు బాగుగా అర్ధమగునట్లు బైబిలును సరియైన విధానములో విభజించితిమి. పాతనిబంధన కన్నా ప్రస్తుతం మనకు క్రొత్త నిబంధన చాలా ప్రాముఖ్యమైన గ్రంధము ఏలయనగా దీనియందు క్రైస్తవుడు ఎలా జీవించవలయునో వ్రాయబడివున్నది. పాతనిబంధన క్రీస్తుకు ముందునున్న వారి కొరకు వ్రాయబడి యున్నది. కనుక మనము పాత నిబంధన కన్నా క్రొత్తనిబంధనకు ప్రాముఖ్య మీయవలయును.

# నీ నాలుకను అదుపులో యుంచు కొనుము

## (Control your Tongue)

పౌలు ఎఫెసులోని సహోదరులకు వ్రాస్తూ "ప్రేమగలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు మనమన్ని విషయములలో ఎదుగుదము" అని చెప్పాడు (ఎఫెసీ 4:15). క్రీస్తులో ఎదగాలంటే మనం సత్యాన్ని చెప్పాలి. సత్యము మనకు బలమైన పునాదివలె పనిచేయును. అటు యిటు కొట్టుకొని పోయే మానవాభిప్రాయాల కంటే అది ఎంతో మిన్న (ఎఫెసీ 4:14).

మన నాలుకలు సత్యాన్ని పట్టుకొనడమే కాకుండా, సత్యం మన నాలుకలను పట్టుకోవాలి. ప్రభువు శరీరమందలి అపయవములైన మనము, చెడ్డవాటిని చెప్పకుండా మన నాలుకలకు బైబిలునే కళ్ళెము వేయనియ్యాలి. సత్యదేవుని యెడల మనకున్న ప్రేమవలనను, సత్యం అవసరమై యున్న వారి యెడల ప్రేమ చూపుటకు మనకున్న ఆస్తకి వలనను ఇది జరగాలి.

"నిర్మలమైన మనస్సాక్షి కలిగినవారై మీలో ఉన్న నిరీక్షణను గూర్చి మిమ్మును హేతువు అడుగు ప్రతివానికిని సాత్వికముతోను భయముతోను సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండి, మీ హృదయముల

యందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠించుడి" యని అపో. పేతురు చెప్పాడు (1 పేతురు 3:15). ప్రతి క్రైస్తవుని హృదయం దేవునికి ప్రతిష్ఠింపబడిన స్థలమై యుండాలి. దేవుడు మన హృదయముల నేలువాడు గనుక మన నిత్య విశ్రాంతి స్థలమగు పరలోకము కొరకు మనము నిరీక్షించుచున్నాము. ఆ నిరీక్షణను గూర్చి ఇతరులు మనలను ప్రశ్నించినపుడు నిష్కపటమైన హృదయంతో, దేవుని యందలి భయంతో వారికి జవాబీయాలి. ప్రశ్నించినవాని ఆత్మ యందలి ప్రేమను బట్టి మన నాలుకను అదుపులో యుంచుకోవాలి.

"ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించునట్టు బోధింపవలెనని" పేతురు హెచ్చరించాడు. "ఇందువలన దేవుడు అన్నిటిలోను యేసుక్రీస్తు ద్వారా మహిమ పరచబడును" (1 పేతురు 4:11). మనం దైవోక్తులను బోధించినప్పుడు సత్యము మనల్ని యేసువైపు సూచిస్తాది. మరియు ఆయనయందు పాపము నుండి స్వతంత్రులనుగా చేస్తాది (యోహాను 5:39; 8:32).

సత్యము, ప్రేమవలన సహోదరుల యెడల మన నాలుక అదుపులో యుంచబడాలి. ఎవనిని దూషింపవలదని తీతు 3:2లో పౌలు చెప్పాడు. (ఫిలిప్పీ 4:8 కూడ చదువండడి). ఇతరులను గూర్చిన దుష్ట తలంపులతో నిండియుండుటవలన క్రైస్తవుడు తనకు తానే తప్పులో అడుగు వేస్తాడు. క్రీస్తు బోధించిన కొన్ని సత్యాలను అపవాది బాగా నేర్చుకొన్నాడు. మత్తయి 12:25లో యేసు ఇట్లు బోధించాడు: "తనకు తానే విరోధముగా వేరుపడిన ప్రతి రాజ్యము పాడైపోవును. తనకు తానే విరోధముగా వేరుపడిన ఏ పట్టణమైనను ఏ యిల్లయినను నిలువదు". సహోదరులు ఒకరిమీద ఒకరు దురభిప్రాయములను వెల్లగక్కుట వలన సంఘాన్ని పాడు చేయుటకు అపవాదికి సహాయము చేయుచున్న వారగుదురు.

ఈ లోకంలో యున్న ప్రతి జంతువును మానవుడు సాధు చేయగలడు గాని "యే నరుడును నాలుకను సాధు చేయనేరడు. (యాకోబు 3:8). నాలుక యొక్క దుష్టత్వాన్ని ఎరిగినవాడై దేవుడు దానిని కటకటాల (పళ్ళ) వెనుక యుంచాడని ఒకాయన చెప్పాడు. మరింత ఎక్కువ

మేలు చేయుటలో సహోదరులను ప్రోత్సాహించుటకు మాత్రమే కటకటాల నుండి వాళ్ళను విడుదల చేయుటకు మనం నిశ్చయించు కొందము గాక.

క్రైస్తవ జీవితమొక పందెము వంటిదని హెబ్రీ పత్రిక లేఖకుడు వర్ణించాడు (హెబ్రీ 12:1,2). ఈ పందెమును కలిసి పరుగెత్తాలని, బలహీనతలను జయించి ఒకరికొకరు సహాయపడాలనేది మనం తెలిసికోవాలని అతడు కోరాడు (హెబ్రీ 12:12-13). తరువాత అతడిట్లన్నాడు: "అందరితో సమాధానమును పరిశుద్ధతయు కలిగి యుండుటకు ప్రయత్నించుడి. పరిశుద్ధత లేకుండ ఎవడును ప్రభువును చూడడు. మీలో ఎవడైనను దేవునికృపను పొందకుండ తప్పిపోవునేమో అనియు, చేదైన వేరు ఏదైనను మొలిచి కలవర పరచుట వలన అనేకులు అపవిత్రులై పోవుదురేమో అనియు జాగ్రత్తగా చూచుకొనుడి" (హెబ్రీ 12:14,15). సహోదరులు ఒండొరులను గూర్చి విమర్శించుచు, పుకార్లు పుట్టించుచుండుట వలన అందరు కలసి పరుగెత్తే పందెములో అభ్యంతరాలు రాకమానవు.

గనుక మనం సత్యాన్ని ప్రకటించుట మాత్రమే గాక, సత్యాన్ని బట్టి మన నాలుకను అదుపులో పెట్టుకొందము. క్రైస్తవుడు కానివానిని దేవుని తట్టును, క్రైస్తవుడైన వానిని పరలోకము తట్టును, సూచించే సంగతులను మాత్రమే ప్రేమతో పలుకుటకు నిశ్చయించుకొందము!!

**సత్యవాణి - క్రీస్తు సంఘము ద్వారా ఉచితంగా ఇయ్యబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. ఆ పాఠములను మీయింటిలోనే పూర్తిచేసి బైబిలు జ్ఞానమును పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి.**

SATYAVANI, P.O.Box-80 KAKINADA - 533 001.

**గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపిచవలయును.**

అయితే ఆనాటికి ప్రబలి యుండే భాషలలో క్రీస్తు బేత్లెహేములో జన్మించెనని, రోమీయులు ఆయనను సిలువవేసి చంపారని అరిమతయి యోసేపు సమాధిలో ఆయన పాతిపెట్టబడెనని, మూడవ దినమున ఆయన తిరిగి లేచెనని, ఆయన శిష్యులు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్త ప్రకటించవలెనని ఆయన ఆజ్ఞ ఇచ్చినట్లు చెప్పబడుచుండును. మరియు నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనొల్లని వానికి శిక్ష విధించబడునని అది చెప్పును. తరువాత ఆయన శిష్యులు క్రైస్తవులనబడిరని, వారు ప్రతి ఆదివారమున రొట్టె విరుచుటకు కూడు కొనేవారని అవి చెప్పును. యేసు తన శిష్యులను పరలోకమునకు కొనిపోవుటకు ఆయన మరల వచ్చుచున్నాడని అవి చెప్పును.

సత్యము మనలను స్వతంత్రులనుగా చేయునని తెలిసికొనుట ఉత్సాహభరితమైనది. అసత్యము అజ్ఞానము వలన లాభము పొందును. ప్రజలు సత్యాన్ని ప్రేమించాలి. తెలిసికోవాలి, సత్యానికి విధేయత చూపాలి, ప్రకటించాలి. అప్పుడు ఆత్మలు నాశనం కాకుండా రక్షించబడ్తాయి. పరలోకం ఆనందిస్తాది.

లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తం చనిపోయెను (1 కొరింధీ 15:4). బైబిలు, బైబిలు భాగములు 1400పైగా భాషలలోనికి తర్జుమా చేయబడి ముద్రితమైనవి. నేటి ప్రపంచములోని అన్ని భాషలలోను అది లభించుచున్నది. ఏదైనా క్రొత్త భాష కనబడితే అది ఆ భాషలో తర్జుమా చేయబడుచున్నది. ఈ లోకంలో యున్న ప్రతి మనుష్యుడు దేవుని గూర్చి, ఆయన సంఘమును గూర్చి తెలిసికోవలసియున్నది! దేవునికి స్తోత్రం!! ఆయున సత్యం ముందుకు వెళ్లుచున్నది!! అది శక్తివంతమైనది, కాలంతో నిమిత్తం లేనిది, అంతర్జాతీయమైనది! క్రీస్తు సువార్త అందరికీ!!

# సత్యవాణి సంగీతమాలిక
## Vol 5 and 6

### ఇప్పుడు లభించుచున్నవి.

మీరు సత్యవాణి రేడియో, T.V కార్యక్రమములలో వినుచున్న ఆహ్లాదకరమైన పాటల కేసెట్లు మొత్తం 6 వాల్యూమ్స్ లభించుచున్నవి. ఆరు కేసెట్లులోను 72 పాతక్రొత్త పాటలు చక్కటి సాంకేతిక పరిజ్ఞానంతో మంచి గాయనీయకులతో రికార్డు చేయబడినవి. ఆరు కేసెట్లుకు 200/-రూ॥లు మాకు పంపవలెను. లేదా 2 కేసెట్లు చొప్పున 65/- రూ॥లు మాకు పంపిచాలి. మీ MO అందగానే మీకు కేసెట్లును అందజేయగలము.

**SATYA VANI**
**P.o Box. 80**
**Kakinada - 533 001, A.P.**



*RNI Regd. No. 6997/98*
*Postal Regd. No. AP/KD-02/2006-2008*


*To*

From:


**SATYA VAKKU**
***P.O. Box 80, Kakinada - 533 001***



Edited & Published by Joshua Gootha [illegible] Satya Vakku [illegible], Sambhamurthy St. Kakinada - 533 001